ఇన్ఫోగ్రాఫిక్

# వివాహ బంధం ఆనందంగా

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందికి స్ఫూర్తిప్రదాత. నవతరం జంటల్లో వైవాహిక బంధం మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్న తరుణంలో... ఆనందంగా సాగిపోయే వైవాహిక జీవితం కోసం ఆయన ప్రవచించిన ఎనిమిది చిట్కాలు.



## 1 ఒకరికి ఒకరుగా


సంతోషకరమైన వైవాహిక జీవితానికి భాగస్వాములు నిబద్ధతతో ఉంటూ, ఒకరికొకరు సహకారం అందించుకుంటూ, సహానుభూతితో మెలగాలి. ఒకరి బాగోగులు ఒకరు పట్టించుకోవడం, అహం తక్కువగా ఉండటం, కష్టాల్లో అండగా నిలవడం అత్యవసరం. కాబట్టి భార్యాభర్తలు సహచరులుగా మసలుకుంటూ ముందుకు వెళ్లాలి.

## 2 నీకోసం నేను

విజయవంతమైన బంధంలో దంపతులు ''నేను నీకోసం ఉన్నాను. కాబట్టి కష్టసుఖాల్లో నా దగ్గర సాంత్వన పొందు! పరిస్థితులు ఎలాగున్నా నేను ఉన్నాను'' అనే భరోసా ఇస్తారు.

## 3 ఆధిపత్యం వద్దు

పెళ్లికి ముందైనా, ఆ తర్వాతైనా ఆధిపత్య లక్షణం మంచిది కాదు. మీ భాగస్వామిని గుప్పిట్లో పెట్టుకోవాలనుకోవడం అంత తెలివైన ఆలోచన కానే కాదు. మీరు ఒకవేళ ఆధిపత్యం చలాయించాలని అనుకుంటే మాత్రం ప్రతికూల ఆలోచనలు ఒక్కొక్కటిగా దాడి చేస్తూ ఉంటాయి. కాబట్టి, జాగ్రత్తగా ఉండాలి.



## 4 బుజ్జగింపు పదేపదే కూడదు

ఏదో కోల్పోయినట్టుగా ముఖం పెట్టుకుని, తమను ఎదుటివారు బుజ్జగించాలని ఆశించేవారిని చూస్తే భాగస్వాములు అక్కడి నుంచి తప్పుకొంటారు. ఇలాంటి తత్వం అప్పుడప్పుడు బాగానే ఉంటుంది. కానీ, పదేపదే అంటేనే మీకు, మిమ్మల్ని ఇష్టపడే వారికి ఇబ్బందికరంగా పరిణమిస్తుంది.

## 5 మాటలు ఆచితూచి

భాగస్వాముల్లో ఒకరు ఏదైనా విషయంలో కోపానికి వచ్చినప్పుడు ఇంకొకరు మౌనంగా ఉండాలి. తగిన సందర్భం చూసి వివరణ ఇచ్చుకోవాలి. అయితే, ఇద్దరూ ఒకేసారి కోపోద్రిక్తులైపోయారంటే మాత్రం ఏదో సమస్య ఉన్నట్టే. కాబట్టి, మాట్లాడేటప్పుడే బాగా ఆలోచించుకోవాలి.

## 6 సహజంగా... క్షమాగుణంతో...

సహజంగా, సరళంగా ఉండాలి. భాగస్వామిని ఎలాగైనా సరే ఆకట్టుకోవాలని బలంగా ప్రయత్నించకూడదు. ఇలా చేస్తే పరిస్థితులు అదుపు తప్పుతాయి. కాబట్టి మీ వరకు మంచిగా ఉండటానికి ప్రయత్నించాలి. సహజంగా, క్షమించే హృదయంతో, వర్తమానంలో ఉండాలి. ఇది పరిస్థితుల్లో ఎంతో మార్పును తీసుకువస్తుంది.

## 7 ఉన్నత లక్ష్యాలు ఉండాలి

ఇక దంపతులు ఇద్దరూ ఎప్పుడూ ఒకరిపై ఒకరు దృష్టి పెట్టేకంటే, ఇద్దరూ తమవైన లక్ష్యాలను నిర్దేశించుకుని కలిసి ముందుకుసాగాలి. ఆ లక్ష్యం కూడా ఉన్నతంగా, సమాజానికి మేలుచేసేదిగా, ఒకరిపట్ల ఒకరికి ప్రేమను పెంచేదిగా ఉంటే మంచిది.

## 8 రుజువులు అడగవద్దు

మీ భాగస్వామి మిమ్మల్ని ప్రేమిస్తున్నట్టు ఎప్పుడూ కూడా రుజువులు అడగకూడదు. వాళ్లు మిమ్మల్ని ప్రేమిస్తున్నారనే భరోసాతో ఉండాలి. వసంతం మళ్లీ మళ్లీ వస్తూ పోతూ ఉంటుంది. జీవితంలో ఓ సందర్భంలో కొంత ఎడం వచ్చినా మళ్లీ బంధం బలపడుతుంది.



